సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 2 । నవంబర్ । 2023



**సర్కారు బడి.. కార్పొరేట్ ఒరవడి**

పేద విద్యార్థుల చదువులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. సర్కారు బడిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ బోధనను మెరుగుపరిచింది. 10లో ▸



**జిల్లా దాటి పింఛను పంపిణీ**

అనారోగ్యంతో సుదూర ప్రాంతాల్లో వైద్యం చేయించుకుంటున్నవారికీ సైతం సత్వరం పింఛను అందిస్తూ వలంటీర్లు పలువురి మన్ననలు పొందుతున్నారు. 10లో ▸

**ఎస్సైకు సేవా పతకం**



సాక్షి, భీమవరం: ఇంటెలిజెన్స్ ఎస్సైగా సేవలందిస్తున్న చీకట్ల రమేష్ బాబు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బెల్లం నాగేశ్వర రావు రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పతకాలకు ఎంపిక య్యారు.

## న్యూస్‌రీల్

### రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



జిల్లా పోలీసు కార్యాలయంలో అమరజీవికి నివాళులర్పిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: భీమవరంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎస్పీ రవిప్రకాష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరజీవి త్యాగఫలంతో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం అవతరించిందన్నారు. 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడంతో ఆంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. దేశంలో కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవి సుబ్బరాజు, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### డిసెంబర్ నుంచి ఆడుదాం ఆంధ్రా

భీమవరం(ప్రకాశం చౌక్): క్రీడల పట్ల గ్రామీణ యువతను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 11 నుంచి జనవరి 15 వరకు రాష్ట్ర మంతటా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు కలెక్టరు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి పశ్చిమ గోదావరి జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన స్పోర్ట్స్ కిట్లను జిల్లా కలెక్టరుకు, ఉభయ గోదావరి జిల్లాల సెట్‌వెల్, స్పోర్ట్స్ సీఈవో చూపించారు. క్రీడా పరికరాలను పరిశీలించి కిట్లు వివరాలను జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. కలెక్టరు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాలకు స్పోర్ట్స్ కిట్లను అందజేస్తారని కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల సెట్‌వెల్, స్పోర్ట్స్ సిఈవో ఎండీహెచ్ మెహరాజ్ పాల్గొన్నారు.

### 8న తిరుపతిలో మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 8 నుంచి 10 వరకూ తిరుపతి వెంకటేశ్వర యూనివర్శిటీలో 42వ మాస్టర్స్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి బీడీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు ప్రశాంతి వాకర్స్ అసోసియేషన్ భవనం వద్ద జట్టు ఎంపిక నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 98852 74122 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

### 18 నుంచి సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర

ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ వీవై ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 18 నుంచి 30 వరకూ 12 రాత్రులు, 13 పగలు యాత్ర ఉండేలా సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర విత్ స్టాట్యూ ఆఫ్ యూనిటీ యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్ర విజయవాడ స్టేషన్ నుంచి ఈ నెల 18న ప్రారంభమై ఖమ్మం, కాజీపేట్, సికింద్రాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. యాత్రలో భాగంగా ఉజ్జయిని, స్టాట్యూ ఆఫ్ యూనిటీ, ద్వారకా, సోమనాథ్, పూణే, నాసిక్, ఔరంగాబాద్‌లోని సప్త జ్యోతిర్లింగాలను దర్శించుకునే అవకాశం ఉందన్నారు. స్లీపర్ క్లాస్ టిక్కెట్ ధర రూ.21 వేలు, థర్డ్ ఏసీ రూ.32,500, సెకంట్ ఏసీ రూ.42,500గా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎల్టీసి సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. సహాయం కొరకు 92814 95848, 97013 60675 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

### ముగిసిన ఎస్‌జీఎఫ్ కరాటే ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: బుధవారం ఏలూరులో సీసీ క్లబ్ ఆవరణలో జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ కరాటే జట్టు ఎంపిక పోటీలు జరిగాయని ట్రెడిషనల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు డీఎల్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రసాద్ పర్యవేక్షణలో చేపట్టిన ఈ పోటీలను కరాటే శిక్షకులు ఇబ్రహీం బేగ్, కరాటే అసోసియేషన్ కార్యదర్శి నాగం శివ పరిశీలించారని వెల్లడించారు. పోటీల్లో ప్రతిభ చాటిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశామని వివరించారు. వీరిలో నందిని, ధనుష్, యశస్విని, అనిల్, మోహత్, భూపతి, ప్రతీమ్, సూర్యఅవినాష్, తారక్, అవినాష్, ఏ శ్రీనివాస్ ఉన్నారని తెలిపారు.

# గ్రామ గ్రామాన ఆరోగ్య సురక్ష

- నేటితో ముగియనున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు
- 20 మండలాల్లో 364 క్యాంపుల నిర్వహణ
- 2.77 లక్షల మందికి వైద్య సేవలు



పెనుమంట్ర మండలం వెలగలవారి పాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో మందులు అందిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం మండలం నందమూరులో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజారోగ్యమే పరమావధిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. మరో అడుగు ముందుకు వేసి ప్రజలకు స్థానికంగానే మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా జగనన్న సురక్ష వైద్య క్యాంపులు గురువారంతో గ్రామాల్లో ముగుస్తున్నాయి. గురువారం జిల్లాలో వెంకట్రామన్న గూడెంలో చివరి క్యాంపు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 30 నుంచి ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపులు జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 34 రోజుల పాటు విజయవంతంగా సాగాయి. ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించారు.

**2.77 లక్షల మందికి వైద్య సేవలు**

జిల్లాలో 20 మండలాలు ఉండగా 364 గ్రామ సచివాలయాలు లక్ష్యంగా బుధవారం నాటికి 353 సచివాలయాల్లో జగన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపులు నిర్వహించారు. మొత్తం 2.77 లక్షల మందికి వైద్య సేవలు అందించారు. 1,490 కేసులను మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, మానసిక, ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ మెడిసన్, గుండె వ్యాధుల వైద్యులు, మత్తు వైద్యులు, కంటి వైద్యులు తదితర 120 మంది స్పెషలిస్టు వైద్యులు సేవలు అందించారు. ప్రతి క్యాంపులో ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యులు సేవలు అందించగా జగనన్న సురక్ష క్యాంపులకు వచ్చే వారికి ఉచితంగా 14 రకాల పరీక్షలు చేసి 120 మందులను అందించారు.

**స్పెషలిస్టు వైద్యుల సేవలు**

గ్రామీణ ప్రాంత ప్రజలు స్థానికంగా గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపులను సద్వినియోగం చేసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో పాటు స్పెషలిస్టు వైద్యులు క్యాంపులకు వచ్చి వైద్య సేవలు అందించడంతో ప్రతి క్యాంపుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి ఆరోగ్య సమస్య బట్టి స్పెషలిస్టు డాక్టర్‌కు చూపించుకుని వైద్య సేవలు పొందారు. ఉచిత పరీక్షలు, మందులు అందుకున్నారు. గ్రామాల్లో మల్టీ స్పెషాలిటీ వైద్య సేవల మాదిరి వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి ఉచితంగా సేవలు అందించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పశ్చిమ గోదావరి జిల్లాలో..**

| | | |
|---|---|---|
| జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల లక్ష్యం | : | 365 |
| పూర్తయిన క్యాంపులు | : | 364 |
| వైద్య సేవలు పొందిన వారు | : | 2,77,371 |
| పురుషులు | : | 1,31,596 |
| స్త్రీలు | : | 1,45,775 |
| ఆరోగ్యశ్రీకి సిఫార్సు | : | 1490 కేసులు |
| మందులు పొందినవారు | : | 2,70,704 |
| కంటి పరీక్షలు | : | 40646 |

**క్యాంపులు సద్వినియోగం**



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. గ్రామాలకు సంబంధించి సురక్ష వైద్య క్యాంపులు గురువారంతో ముగిస్తున్నాయి. బుధవారం నాటికి 2.77 లక్షల మందికి వైద్య సేవలు అందించారు. ప్రతి వార్డులో కూడా సురక్ష క్యాంపు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. పట్టణాలకు సంబంధించి ఇప్పటివరకు 50 వేల మందికి వైద్య సేవలు అందించారు. 1723 కేసులు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిపార్సు చేశారు.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

## ధాన్యం సేకరణలో సమస్యలు తలెత్తకుండా చర్యలు

**జేసీ రామ్‌సుందర్‌రెడ్డి**



ధాన్యం సేకరణపై మాట్లాడుతున్న జేసీ

సాక్షి, భీమవరం: ధాన్యం సేకరణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో వారం రోజుల్లో ధాన్యం రైతు చేతికి వస్తుందని దానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా రైస్ మిలర్లు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గోనె సంచులు నిల్వచేసుకుని బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలని మిల్లర్లను ఆదేశించారు. గత రబీ సీజన్‌కు సంబంధించి మిల్లర్లు కస్టమ్ మిలింగు రైస్ సుమారుగా 52 వేల మెట్రిక్ టన్నులు ప్రభుత్వానికి ఇవాల్సి ఉన్నందున వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆర్‌బీకెలలో ధాన్యం కొనుగోలుకు అవసరమైన మెటీరియల్ అందచేశామన్నారు. రైతులు పండించిన పంటంతా కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా స్నేహపూరిత వాతావరణంలో అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజరు టి.శివరామ ప్రసాదు, ఏఎస్‌ఓ ఎం.రవిశంకర్, జిల్లా రైసు మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరులో భారీ వర్షం



ఏలూరు నగరంలో మేఘావృతమైన ఆకాశం

అకాల వర్షం బుధవారం రాత్రి నగరాన్ని ముంచెత్తింది. సాయంత్రం 4 గంటల సమయంలో ఆకాశం మబ్బులతో నిండిపోయింది. సాయంత్రం 6 గంటల సమయంలో ఒక్కసారిగా గాలి వీచి వరుణుడు నగరాన్ని పలుకరించాడు. చినుకుచినుకుగా మొదలైన వాన క్షణాల్లోనే కుండపోత వర్షంగా మారడంతో నగర ప్రజలు ఇబ్బంది పడ్డారు. దాదాపు 45 నిమిషాల పాటు కురిసిన వాన కారణంగా రామచంద్రరావు పేట, పవర్ పేట రైల్వేస్టేషన్ రోడ్డు, గన్ బజారు ప్రాంతాలు నీటమునిగాయి. – ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)





జలమయమైన నగర రహదారులు

## జెడ్పీ పనులు సకాలంలో పూర్తి చేయాలి

**పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి**



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: జెడ్పీ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులన్నీ తక్షణమే మొదలుపెట్టి నిర్ణీతసమయంలో పూర్తిచేసేలా అధికార యంత్రాంగం కృషిచేయాలని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన తణుకు నియోజకవర్గ జిల్లా పరిషత్ అధికారులు, పార్టీ శ్రేణుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోను స్థానిక ప్రజల సౌకర్యార్థం ఏ పని ముందుగా చేపట్టాల్సి ఉందో తెలుసుకుని దానికి ప్రాధాన్యతనిస్తూ సదరు పని పూర్తిచేయాలని కోరారు. గతంలోనే పిలిచిన వర్కుల్లో కొన్ని మార్పులు చేసి తిరిగి జిల్లా పరిషత్ నిధులు రూ. 5.10 కోట్లతో టెండరు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఏ ప్రాంతంలో ఏ పనిచేయాల్సి ఉందో స్థానిక నాయకులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని ఆదేశించారు. జెడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు మాట్లాడుతూ జిల్లా పరిషత్ విభాగంలో చేపట్టాల్సిన పనుల్లో ముందుగా అధిక ప్రాధాన్యత కలిగిఉన్న వాటిని పూర్తిచేస్తామని, పూర్తయిన వెంటనే సదరు బిల్లులు వెంటనే వచ్చేలా కృషిచేస్తామని చెప్పారు. తణుకు మున్సిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు చెందిన పార్టీ నాయకులు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని పరిష్కారానికి కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు గంటా ప్రసాద్ కోరారు. ఈ ర్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, తణుకు, అత్తిలి ఏఎంసీ చైర్మన్‌లు నత్త కృష్ణవేణి, బుద్దరాతి భరణిప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మంగెన సూర్య, తణుకు, అత్తిలి మండలాల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## లేఅవుట్లను వెబ్‌సైట్‌లో ఉంచాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ఆమోదం పొందిన లేఅవుట్లను ప్రజల పరిశీలన నిమిత్తం జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచుతామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు, డీపీఓ, జిల్లాలోని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమై లేఅవుట్లపై సమీక్షించారు. అక్రమ లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. అనుమతి పొందిన లేఅవుట్లను గ్రామాల వారీగా ప్రజలు పరిశీలించుకునేందుకు అనువుగా జిలా వెబ్‌సైట్‌లో ఉంచాలన్నారు. అర్బన్ టౌన్ ప్లాన్ లాగా గ్రామాల్లో ప్లాన్ లేదని, సమిత్వ గ్రామ కంఠం సంబంధించి సర్వేలో విలేజ్ ప్లాన్‌లో డ్రెయిన్లు, రోడ్లు అప్రూవ్ చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వీసీ చంద్రశేఖర్, ప్లానింగ్ ఆఫీసర్ సురేఖ, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, భీమవరం టౌన్ ప్లానింగ్ అధికారి గౌర్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎం విశ్వకర్మ యోజనపై అవగాహన కల్పించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): గ్రామ గ్రామాన అర్హులైన ప్రతి ఒక్కరికి పీఎం విశ్వకర్మ యోజన పథకం ప్రయోజనం అందేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం భీమవరంలోని కలెక్టరేట్ చాంబర్‌లో పీఎం విశ్వకర్మ యోజన పథకం అమలు కమిటీ సభ్యులతో సమావేశమై సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని సంబంధిత కార్పొరేషన్ల అధికారులు తప్పక గుర్తించి దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. అలాగే అర్హులందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఉయ్యాల అది శేషు, గ్రామ వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు







పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ , కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, తణుకులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మంత్రి కారుమూరి నివాళులు

భీమవరం (ప్రకాశంచౌక్): తెలుగు రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు భీమవరం కలెక్టరేట్ ఆవరణలో బుధవారం కనులపండువగా జరిగింది. తొలుత కలెక్టర్ పి.ప్రశాంతి పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎస్పీ యు.రవి ప్రకాష్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో వేడుకలను జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. విద్యాశాఖ ఏర్పాటుచేసిన మా తెలుగు తల్లికి మల్లెపూదండ, ఆంధ్రప్రదేశ్ థీమ్ సాంగ్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు వంటి మహనీయుల త్యాగఫలితమే భాష ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిందని, వారిని ఘనంగా స్మరించుకోడం గొప్ప విషయంగా భావించాలన్నారు. 68వ సంవత్సరంలోకి అడుగిడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథం వైపు పయనిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాలలో విద్య, వైద్యం, రైతుకు ప్రాధాన్యతనిస్తూ చేపట్టడంతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో ముందు ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆనాటి మద్రాసు రాష్ట్రంలో తెలుగు ప్రజలే అత్యధిక సంఖ్యలో ఉండడంతో ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఉద్యమం మొదలైందన్నారు. 1952లో పొట్టి శ్రీరాములు ప్రత్యేక రాష్ట్రం కొరకు 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేశారని తెలిపారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం వచ్చేలా మహనీయులు చేసిన త్యాగాలను మననం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఆర్వో కె.కృష్ణవేణి, ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు, డీఎస్పీ బి.శ్రీనాథ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

### అమరజీవికి నివాళులు

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు చంద్రబాబునాయుడు తీరనిద్రోహం చేశాడని ఉపముఖ్యమంత్రి, కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ అవతవరణ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అవతరణ దినోత్సవం నవంబరు 1ని చంద్రబాబు జూన్ 2కి మార్చేశాడన్నారు. 2019లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి తిరిగి నవంబర్ 1ని ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి భాస్కరరావు, మానికొండ వెంకటేశ్వరరావు, గార్లపాటి వీరకుమార్, నున్న నాగలక్ష్మి, మండవల్లి చెన్నా నాగేంద్ర, మండా బ్రహ్మాజి, నున్న బాలాత్రిపుర సుందరరావు ఏకాంబరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఘన నివాళి

తణుకు అర్బన్: రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి కారుమూరి మాట్లాడుతూ తెలుగు వాళ్లమంతా కలిసికట్టుగా ఉన్నామంటే అది పొట్టి శ్రీరాములు పుణ్యమేనని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు బడి.. కార్పొరేట్ ఒరవడి

- ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు
- మన బడి నాడు–నేడు పథకంతో కొత్త రూపు
- అత్యాధునిక పరికరాలతో విద్యా బోధన
- బడుల్లో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య



ఆకివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం



ఐఎఫ్ ప్యానల్ బోర్డు ద్వారా పాఠాలు వింటున్న విద్యార్థులు

**ఆకివీడు:** పేద విద్యార్థుల చదువులకు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఇప్పటికే విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చి రూ.వేల కోట్ల వ్యయంతో ప్రభుత్వ బడులను సుందరంగా తీర్చిదిద్దడమే కాక సకల సదుపాయాలు కల్పించి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా అత్యాధునిక పరికరాలతో బోధనను మెరుగుపరిచింది.

**గ్లోబలీకరణలో విద్య**

నాడు–నేడు పథకం అమలుతో పాఠశాలలు విద్యార్థుల్ని ఆకర్షిస్తున్నాయి. అంగన్‌వాడీ సెంటర్ల నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఆధునిక విద్య అందుబాటులోకి వచ్చింది. పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీలు, బైజూస్ ప్యాడ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూములు, 4జీ ఇంటర్నెట్, నిరంతరం విద్యుత్‌ను అందజేసే సోలార్ ప్యానల్స్, యూట్యూబ్ వంటి సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఆయా పాఠ్యాంశాలను చదువుకోవడమే కాకుండా ఐఎఫ్‌పీ ద్వారా అంతర్జాతీయ సమాచారాన్ని కూడా తెలుసుకునే అవకాశం కలిగింది. గ్లోబలీకరణతో విద్యార్థులకు అంతర్జాతీయ సమాచారం అందుబాటులో ఉంది.

**ఆధునిక పరికరాల పంపిణీ**

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు గత ఏడాది 14,353 ట్యాబ్‌లు అందజేశారు. వీరితో పాటు ఉపాధ్యాయులకు 2,373 ట్యాబ్‌లు ఇచ్చారు. జిల్లాలోని 158 ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి నుండి 10వ తరగతి వరకూ ఉన్న విద్యార్థులకు బోధన కోసం 980 ఐపీ ప్యానల్స్, 203 ప్రాథమిక పాఠశాలలకు 292 స్మార్ట్ టీవీల పంపిణీ జరిగింది. గత ఏడాది ఎనిమిదో తరగతి చదివిన విద్యార్థులు ఈ ఏడాది తొమ్మిదో తరగతిలో బైజూస్ ట్యాబ్‌లను వినియోగిస్తారు. ట్యాబ్‌లలో ఇప్పటికే 9వ తరగతి సబ్జెక్టులు డౌన్‌లోడ్ చేసుకుని విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు.

**నాడు–నేడులో..**

జిల్లాలో నాడు–నేడు పథకంలో మొదట విడతలో 497 పాఠశాలలు రూ.107.04 కోట్లతో అభివృద్ధి పరిచారు. రెండో విడతలో 729 పాఠశాలలను రూ.2153 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే రెండో విడతలో 90 శాతానికి పైగా పనులు పూర్తి అయ్యాయి.

**జిల్లాలో నాడు–నేడు పనుల వివరాలు**

| స్టేజ్‌లు | పాఠశాలలు | రూ.కోట్లలో |
|---|---|---|
| మొదట విడత | 497 | 107.04 |
| రెండో విడత | 729 | 253 |
| **డిజిటల్ విద్యా పరికరాలు** | | |
| ఐఎఫ్ ప్యానల్స్ | 980 | 158 |
| స్మార్ట్ టీవీలు | 292 | 203 |
| డిజిటల్ రూమ్‌లు | 158 | 158 |
| **బైజూస్ ప్యాడ్‌ల పంపిణీ** | | |
| విద్యార్థులకు.. | | 14,353 |
| ఉపాధ్యాయులకు.. | | 2,373 |
| **జిల్లాలో మొత్తం స్కూళ్లు, విద్యార్థులు** | | |
| ఎంపీపీ | 1,078 | 33,639 |
| ఎంపీపీ ఎయిడెడ్ | 25 | 450 |
| యూపీ స్కూల్స్ | 85 | 7,642 |
| యూపీ ఎయిడెడ్ | 3 | 137 |
| జెడ్పీ స్కూల్స్ | 207 | 68,175 |
| జెడ్పీ ఎయిడెడ్ | 15 | 2,174 |
| మొత్తం | 1,413 | 1,12,217 |

### ఐఎఫ్ ప్యానల్ అద్భుతం



ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా పిల్లలకు అద్భుతమైన విద్యా బోధన అందుతోంది. ఉపాధ్యాయుడు బోధించడానికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంది. సైన్సు, లెక్కలు, ఇంగ్లిష్ పాఠ్యాంశాలు విద్యార్థులకు బాగా అర్థమయ్యేలా ఐఎఫ్ ప్యానల్ దోహదపడుతోంది. అభ్యసనా సామర్థ్యం మెరుగుపడుతోంది.

– శ్రీకాళహస్తీశ్వరుడు, ప్రధానోపాధ్యాయులు, పెదకాపవరం జెడ్పీ హైస్కూల్


### అభ్యసనా సామర్థ్యం పెరుగుతోంది



విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం ఐపీ ప్యానల్ ద్వారా పెరుగుతోంది. అంతర్జాతీయ స్థాయిలో పాఠ్యాంశాలకు సంబంధించిన విషయాలతో పాటు, ఇతర విషయ పరిజ్ఞానం తెలుసుకోవచ్చు. పాఠశాల స్థాయిలోనే కాకుండా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా పోటీ పడే అవకాశం ప్యానల్ బోధనతో సాధ్యమే.

– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

### ట్యాబ్‌లో పాఠాలు అర్థమవుతున్నాయి



బైజూస్ ట్యాబ్‌లో పాఠాలు వినడం, చదవడం చాలా ఉపయోగకరంగా ఉంది. జ్ఞాపక శక్తిని పెంపొందిస్తుంది. 8వ తరగతిలో కొద్దిగా ఇబ్బంది ఏర్పడినా, ప్రస్తుతం 9వ తరగతిలో పాఠాలు చాలా బాగా అర్థమవుతున్నాయి. బైజూస్ ట్యాబ్‌లు ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– మల్లాడి ప్రసన్న, 9వ తరగతి, జెడ్పీ స్కూల్, సిద్ధాపురం, ఆకివీడు మండలం

## క్లుప్తంగా

### డేటా ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

**భీమవరం (ప్రకాశంచౌక్):** జిల్లా సర్వే శాఖ డేటా ప్రాసెసింగు సెంటర్ నూతన కార్యాలయాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే రికార్డులను అత్యంత వేగవంతంగా ఆన్‌లైన్ చేయడానికి ఈ నూతన కార్యాలయాన్ని ఉపయోగించనునట్లు ఆమె తెలిపారు. డేటా ప్రాసెసింగు సెంటర్‌కు అత్యాధునికమైన కంప్యూటర్లను ఏర్పాటు చేసి 20 మంది సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమించామన్నారు. రికార్డుల నమోదు వేగవంతం చేసి, మూడో దశ రీసర్వే పనులు నవంబరు చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. జేసీ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి, ఆర్డీవో కె.శ్రీనివాసులురాజు, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జీవీకే మల్లికార్జునరావు పాల్గొన్నారు.

### జూడో జాతీయ పోటీలకు గొల్లపల్లి విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని శ్రావణిని అభినందిస్తున్న దృశ్యం

**నూజివీడు:** మండలంలోని గొల్లపల్లి హైస్కూల్ ఏడో తరగతి విద్యార్థిని శ్రావణి జాతీయ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం దుర్గామల్లేశ్వరి చెప్పారు. ఇటీవల అనంతపురంలో నిర్వహించిన జూడో పోటీల్లో శ్రావణి ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించిందన్నారు. దీంతో జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికై ఒదన్నారు. ప్రతిభ చూపిన శ్రావణిని బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. అలాగే హిందీ ఉపాధ్యాయిని మల్లేశ్వరి క్రీడాకారిణికి నగదును అందించారు. పీడీ పీ రవీంద్ర, ఉపాధ్యాయులు మోహన్‌రావు, సాకా రవి, పుల్లారావు, బాలు, మనోహరం, కోటేశ్వరమ్మ, సౌజన్య అభినందించారు.

## అయ్యప్ప దీక్షాధారుల ఆందోళన



తూర్పుతాళ్లులో ఈశ్వరా కాన్వెంట్ ఎదుట ఆందోళన చేస్తున్న అయ్యప్ప మాలధారులు

**నరసాపురం రూరల్:** అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థిని పాఠశాలకు అనుమతించకపోవడంతో అయ్యప్ప దీక్షధారులు ఆందోళనకు దిగిన సంఘటన మండలంలోని తూర్పుతాళ్లులో చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుతాళ్లులోని ఈశ్వరా కాన్వెంట్‌లో వేములదీవి పడమర సర్దుకొడప గ్రామానికి చెందిన జక్కంశెట్టి మనోహర్ 8వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం అయ్యప్ప మాల ధరించిన మనోహర్ స్కూల్‌కు వెళ్లగా కాన్వెంట్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కడలి శ్రీమన్నారాయణ విద్యార్థి మనోహర్‌ను దూషించారు. ఇంటికి వెళ్లిన అనంతరం విద్యార్థి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా దీనిపై మనోహర్ తండ్రి కరస్పాండెంట్‌ను ప్రశ్నించారు. కరస్పాండెంట్ శ్రీమన్నారాయణ మనోహర్ తండ్రిని కూడా దూషించారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో బుధవారం మధ్యాహ్నం ఈశ్వరా కాన్వెంట్ వద్దకు అయ్యప్ప దీక్షధారులు పెద్దెత్తున తరలివచ్చి ఆందోళనకు దిగారు. కాన్వెంట్ ఎదుట బైఠాయించి స్కూల్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడికి రాగా వారితోనూ వాగ్వాదం జరిగింది. సుమారు నాలుగు గంటల వివాదం అనంతరం డీఎస్పీ రవిమనోహరాచారి ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగంతో పాటు జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఎంపీటీసీలు పిల్లి పుష్పరాజ్యం, జాన్ ప్రభాకర్, గ్రామ ప్రముఖులు అడ్డాల శ్రీను, తిరుమాని నాగరాజు తదితరులు చర్చలు జరిపారు. చివరకు విద్యార్థి తల్లిదండ్రులు, అయ్యప్ప దీక్షధారులకు కరస్పాండెంట్ శ్రీమన్నారాయణ క్షమాపణ చెప్పడంతో ఆందోళన విరమించారు.

## స్వామిత్వ సర్వేను వేగిరపర్చాలి

జేసీ రామసుందర్‌రెడ్డి



మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

**తాడేపల్లిగూడెం:** స్వామిత్వ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సర్వేపై ఆయన సమీక్షించారు. గ్రామాల్లో ఇళ్లు, ఇంటి స్థలాల సర్వే, మూడో దశ రీసర్వే పనులు, కంప్యూటర్ డేటా, రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రతీ ఒక్కరికి నోటీసులు జారీ చేసి వారి సమక్షంలోనే సర్వే చేయాలన్నారు. గ్రామకంఠం సర్వేలపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. పట్టణంలో అభివృద్ధి పనుల ప్రగతి అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో రూ.5.50 కోట్లతో 11 ఎంఎల్‌డీ సామర్థ్యంతో చేపట్టిన వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తిచేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు.

**పారదర్శకంగా రీ సర్వే**

పురపాలక సంఘ పరిధిలో సర్వే అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో రీసర్వే పనులు పారదర్శకంగా చేయాలని జేసీ ఆదేశించారు. సర్వేలో వ్యత్యాసాలు ఉంటే రోవర్‌తో పరిశీలించుకోవాలన్నారు. ఆర్డీఓ కె.చెన్నయ్య, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, మున్సిపల్ కమిషనర్ ఎ.శామ్యూల్, మున్సిపల్ డీఈ మురళీకృష్ణ, సర్వేయర్ రౌతు రామకృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ జీవీ శేషగిరి పాల్గొన్నారు.

### కట్టుదిట్టంగా విజిబుల్ పోలీసింగ్

ఎస్పీ యు.రవిప్రకాష్



**సాక్షి, భీమవరం:** జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ యు.రవిప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాల నడిపేవారిపై 80 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై 1,161 కేసులు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టుల్లో హాజరుపరిచామన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల భద్రత, నేర నియంత్రణలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌ను కట్టుదిట్టం చేయడమేగాక ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు ప్రధానమైన కూడళ్లలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు, హెల్మెట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

### బస్సులో ప్రయాణిస్తూ వృద్ధురాలి మృతి



కవిటపు భారతి మృతదేహం

**పాలకోడేరు:** ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ గుండెపోటుతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఉండి మండలం వెలివర్రు గ్రామానికి చెందిన సుమారు 60 ఏళ్ల పైబడిన కవిటపు విజయభారతి ఓ వివాహానికి హాజరయ్యే నిమిత్తం బుధవారం సాయంత్రం వెలివర్రు నుంచి భీమవరం వెళ్లింది. అక్కడ నుంచి పాలమూరులో జరిగే ఓ వివాహానికి హాజరయ్యేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు పెన్నాడ సమీపంలోకి వచ్చేసరికి ఒక్కసారిగా ఆమె కుప్పకూలింది. బస్సులోని ప్రయాణికులు బస్సును పరిశీలించగా, అప్పటికే ఆమె మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్సై నాళం శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పాము కాటుకు మహిళా కూలీ మృతి



మృతురాలు మార్తమ్మ

**పెదవేగి:** ఆయిల్‌పామ్ తోటలో పనిచేస్తుండగా పాము కాటుకు గురై ఓ మహిళా కూలీ మృతి చెందింది. ఎస్సై ఎం.లక్ష్మణ్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేగివాడకు చెందిన కాట్రు లక్ష్మణరావు, మార్తమ్మ (35) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి పిల్లలు లేరు. మార్తమ్మ బుధవారం అదే గ్రామానికి చెందిన జిజ్జురి వెంకటేశ్వరరావు అనే రైతు పొలంలో పనికి వెళ్లింది. ఆయిల్‌పామ్ తోటలో పనిచేస్తుండగా ఉదయం తొమ్మిది గంటల సమయంలో పాము కాటు వేసింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను ద్విచక్ర వాహనంపై ఏలూరు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో ఉన్న గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి ద్విచక్రవాహనంపై ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మార్తమ్మ మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## సొసైటీ ఖాతాదారులు ఆందోళన చెందొద్దు

**ఉండి:** ఉండి కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో ఉద్యోగుల అవినీతి వ్యవహారంపై రైతులు, ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బ్యాంక్ త్రిసభ్య కమిటీ చైర్మన్ పేరిచెర్ల సూర్యనారాయణరాజు అన్నారు. బుధవారం బ్యాంక్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకుకు చెందిన మొండి బకాయిల వసూలు క్రమంలో ఈ అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు. సుమారు 2010 నుంచి అవినీతి జరుగుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ చేసినట్లు తెలిపారు. బ్యాంక్ కోలమూరు శాఖలో మేనేజర్‌గా వ్యవహరిస్తున్న దుర్గారావు, ఉండి మెయిన్ బ్యాంక్‌లో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ ఇద్దరూ ఈ అవినీతికి పాల్పడినట్లు తేలిందన్నారు. ఈ సొమ్మును తిరిగి బ్యాంకుకు చెల్లించాలని కొంత గడువు ఇచ్చినా వారు చెల్లింకపోవడంతో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆదేశాలతో అధికారులు విచారణ చేపట్టారన్నారు. ప్రస్తుతం రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అయితే మరింత విచారణ జరగాల్సి ఉందన్నారు. విచారణలో భాగంగా బ్యాంకు సభ్యులు ఏడు వేల మందికి వారి ఖాతాలు, రుణాలు, చెల్లింపులపై నోటీసులు ఇస్తారని, వాటన్నింటినీ పూర్తిస్థాయిలో విచారించి నిజానిజాలు తేలుస్తారన్నారు. దీనిపై రైతులు, ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బ్యాంకు త్రిసభ్య కమిటీ సభ్యుడు కరిమెరక శివనాగరాజు పాల్గొన్నారు.

## సిద్ధాంతంలో బయటపడిన పానవట్టం



అమ్మవారి విగ్రహం పాదాల కింద పానవట్టం

**పెనుగొండ:** దక్షిణ కాశీగా పేరుగాంచిన వశిష్టా తీరంలోని కేదారీఘాట్‌లో వందల ఏళ్ల నాటి కేదారేశ్వర స్వామి ఆలయంలోని బాలా త్రిపురసుందరి విగ్రహం కింద పానవట్టం తవ్వకాల్లో బుధవారం బయటపడింది. కేదారేశ్వర స్వామి ఆలయంలో మరమ్మతుల నిమిత్తం తవ్వకాలు జరుపుతుండగా కేదారేశ్వరస్వామి ఉపాలయంలో ఉన్న దక్షిణం వైపు శ్మశానం వైపు దిశగా పూర్వకాలమే బాలా త్రిపుర సుందరిని విగ్రహాన్ని ప్రతిష్టించారు. అయితే ఇప్పుడు గ్రానైట్ పనులు చేయడానికి తవ్వకం పనులు చేస్తుండగా, పానవట్టం బయటపడింది. పానవట్టం ఎంతో విశిష్టమైనదని, ఎక్కడో గాని ఉండదని పురోహితులు చెబుతున్నారు. అమ్మవారు పానవట్టంపై ఉండడం విశేషమన్నారు. దీంతో పరిసర ప్రాంతాలకు చెందిన వారు పానవట్టంపై అమ్మవారిని దర్శించుకోవడానికి తరలివస్తున్నారు. ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయంలో గ్రానైట్ పనులతో పానవట్టం దర్శనం ఇచ్చిందన్నారు. పానవట్టంపై అమ్మవారు ఉండడం విశేషమని, దీనిని ఎవరూ ఊహించనిదన్నారు. మరమ్మతులు పూర్తవ్వగానే అమ్మవారిని సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు.

### ● గడపగడపకు సంక్షేమం



కాళ్ల : జువ్వలపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు బ్రోచర్ అందిస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

### అమరజీవి ఆశయసాధనకు కృషి చేయాలి



శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం :** ప్రాణత్యాగంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన పొట్టి శ్రీరాములు ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం వర్సిటీలో ఏర్పాటుచేసిన రాష్ట్రావతరణ వేడుకల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రం రెండుగా విడిపోయినా తెలుగువారు వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద ఉద్యోగులు నివాళులర్పించారు. డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఏఎస్.పద్మావతమ్మ, పరిశోధనా సంచాలకులు నారం నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డి.వెంకటస్వామి, డీన్ పీజీ స్టడీస్ సూర్యకుమారి, డీఎస్ఏ సలోమి సునీత, ఈఈ ఎం.చిరంజీవులు, జాయింట్ రిజిస్ట్రార్ వి.ఆనంద్‌బాబు, డిప్యూటీ రిజిస్ట్రార్ వైవీ మంగరాజు పాల్గొన్నారు.

## జిల్లా దాటి పింఛను సొమ్ము అందించి..



శనివారపుపేటలో గంటా లక్ష్మీకాంతంకు పింఛను అందజేస్తున్న వలంటీర్ అన్నారోజ్



అమలాపురం ఆస్పత్రిలో పింఛను సొమ్ము అందిస్తున్న ఇలపర్రు వలంటీరు ప్రకాష్‌రాజ్



విజయవాడలో నాగరత్నమ్మకు పింఛను అందిస్తున్న వలంటీర్ యామిని

**తణుకు టౌన్:** నెలలో ఒకటో తేదీనే గ్రామాల్లోని వలంటీర్లు తమ పరిధిలో లబ్ధిదారులకు సకాలంలో పింఛను సొమ్మును అందిస్తున్నారు. గ్రామంలో ఉన్న వారికే కాక అనారోగ్యంతో సుదూర ప్రాంతాల్లో ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నవారికీ సైతం సత్వరం పింఛను అందిస్తూ వలంటీర్లు పలువురి మన్ననలు పొందుతున్నారు. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామానికి చెందిన గంటా లక్ష్మీకాంతం వృద్ధాప్యం కారణంగా ఏలూరు శివారు శనివారపుపేటలో ఉంటున్న తన కుమార్తె వద్ద ఉంటోంది. బుధవారం ఆ వార్డు వలంటీర్ అన్నా రోజ్ శనివారపుపేట వెళ్లి మంచంపై ఉన్న లక్ష్మీకాంతంకు పింఛను సొమ్ము అందజేసింది. వలంటీర్ అన్నా రోజ్ సేవలను పలువురు అభినందించారు.

**అమలాపురంలో ఆసుపత్రికి వెళ్లి**

**పెనుగొండ:** ఇలపర్రు శివారు గుడిపాడుకు చెందిన యాండ్ర సత్యనారాయణ అనారోగ్యంతో కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నారు. గ్రామానికి చెందిన వలంటీరు నూకపెయ్యి ప్రకాష్‌రాజ్ ఆసుపత్రికి వెళ్లి తొలిరోజే బుధవారం సత్యనారాయణకు వృద్ధాప్య పింఛను అందించారు. ఆసుపత్రికి వెళ్లి ఫించన్ అందించి నిబద్ధత చాటుకున్న ప్రకాష్‌రాజ్‌ను సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షురాలు దండు పద్మావతి, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, కార్యదర్శి శివ రామకృష్ణ అభినందించారు.

**విజయవాడ వెళ్లి..**

**మండవల్లి :** కానుకొల్లు గ్రామానికి చెందిన చెరుకూరి నాగరత్నమ్మ అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలో కుటుంబ సభ్యుల వద్ద ఉంది. దీంతో నాగరత్నమ్మ అవసరాలను గుర్తించిన కానుకొల్లు వలంటీర్ రాయగిరి యామిని విజయవాడ వెళ్లి బుధవారం వృద్ధాప్య పింఛనును అందజేసింది. దీంతో కుటుంబ సభ్యులు వలంటీర్ యామినిని అభినందించారు.


## సాక్షి క్లాసిఫైడ్స్

**Services**

■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారు విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-6278]

**GOLD FINANCE**

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999 [B-6058]

**BUSINESS OFFER**

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact: for more info: 8099161810 [H-193267]

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710 [HA-41758]

■ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్, డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9281159721, 8919551629 [H-788343]




**Wanted**

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-801032]

■ Wanted Pharmacist with B Pharmacy Degree to Work at SVSC trust hospital Medical store, Alampuram.Cont:9848222212 [P-193051]

■ కష్టమైనా కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 - 40000/-ఫ్రీ రూమ్+భోజనం. Hyd, Ph: 8919613984 [HA-800]

■ Tanmayee ఓల్డేజ్ హోమ్, YSR సర్కిల్ వద్ద, పైపుల రోడ్డు, విజయవాడ. RMPలు, ఆడ, మగ వర్కర్లు, వంట మనిషి కావలెను. వయస్సు: 20 నుండి 50 సం॥ Ph: 9652423559/ 7093911010/ 9573000987 [HA-767]

■ రెయిన్‌బో కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు కావలెను. 10th, ఇంటర్, పాస్/ఫెయిల్ కమీషన్ ఇవ్వబడును, 2వీలర్ కంపల్సరీ, ఫోన్ : 9398981980 [H-793482]

■ రామకృష్ణ గ్రూపు, (AP No.1) VJA, HYD శ్రీమంతులఇళ్ళలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91608 91122, 92814 52838 [B-1206459]

**గమనిక**

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## క్లుప్తంగా

### ఆకట్టుకున్న సిరిమువ్వ డ్యాన్స్ పోటీలు



సిరిమువ్వ ఆధ్వర్యంలో నృత్య పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** సిరిమువ్వ 26వ వార్షికోత్సవాల సందర్భంగానూ, ఏపీ రాష్ట్ర ఆవతరణ దినోత్సవాన్ని తేదీ పురస్కరించుకుని, సిరిమువ్వ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గమిని ఫంక్షన్ ప్లాజాలో డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. కూచిపూడి, భరత నాట్యం, శాస్త్రీయ నృత్యాల విభాగాల్లో పోటీలను నిర్వహించారు. నాట్య ప్రదర్శన చేసిన చిన్నారులకు నాట్య సిరి ప్రతిభా అవార్డులు అందజేశారు. అలాగే ప్రముఖులకు పొట్టి శ్రీరాములు విశిష్ట సేవా రత్న అవార్డులు ఇచ్చారు. కార్యక్రమాన్ని గ్రంధి సత్యనారాయణ, గమిని సుబ్బారావు, గట్టిం మాణిక్యాలరావు, పెద్దోజు శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు.

### క్రైస్తవ పుస్తక ప్రదర్శన ప్రారంభం



పుస్తకాలను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్

**తాడేపల్లిగూడెం:** పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలులో ఏర్పాటు చేసిన క్రైస్తవ పుస్తక ప్రదర్శనను బుధవారం మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఏడో తారీఖు వరకూ నిర్వహిస్తారని వివరించారు. బ్యూటీఫుల్ బుక్స్ చెన్నై వారు ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో క్రైస్తవ్యానికి సంబంధించిన అన్ని పుస్తకాలు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్, రిటైర్డు ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ సి.జయంత్ రావులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు తణుకు విద్యార్థులు



క్విజ్ పోటీల్లో రాణించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**తణుకు అర్బన్:** తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం భీమవరంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో సాధారణ ఆరోగ్యం, కౌమార విద్య–ఆరోగ్యం, హెచ్ఐవీ ఎడ్యుకేషన్, రక్తదానం, ఆరోగ్య కార్యక్రమాలు అనే అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు కొలుకులూరి తన్మయ ప్రియ, కొండా గణేష్ విజేతలుగా నిలిచి ఈనెల 4వ తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం కె.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు ఉమాదేవి, సులోచన, రాధాకుమారి, వెంకటలక్ష్మి, రాంబాబు అభినందించారు.

### నేడు అలంపురంలో ఉచిత వైద్య శిబిరం

**పెంటపాడు:** మండలంలోని అలంపురం గ్రామంలోని వెంకటరమణ సేవాచారిటీ ఆస్పత్రిలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు ప్రతినిధి కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన ఎముకలు, కీళ్లు, జనరల్ సర్జన్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, చెవి, ముక్కు గొంతులకు సంబంధించి పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల రోగులు వినియోగించుకోవాలని కోరారు.

### వైభవంగా పడిపూజ



అయ్యప్పస్వామికి నిర్వహిస్తున్న పడిపూజ

**తణుకు:** పట్టణంలోని జాతీయ రహదారి ఆనుకుని వేంచేసిన శ్రీశాస్త పంచాయతన అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి వైభవంగా పడి పూజ కార్యక్రమం నిర్వహించారు. పూజారి సత్యనారాయణ స్వామి సమక్షంలో అయ్యప్పస్వామి వారికి విశేష అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. అనంతరం భక్తులకు అల్పాహారం వితరణ జరిగింది. చక్రస్వామి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. నాగరాజు, వాసు, రవి, బాబీ, రాజేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి



అత్తిలి: పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రమంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు టౌన్: పైడిపర్రులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



ఇరగవరం: ఎంపీడీవో కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

**అత్తిలి:** ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా బుధవారం అత్తిలి కాలువ గట్టున ఉన్న శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహానికి మంత్రి కారుమూరి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. గ్రామాలలో పౌరసేవలు ప్రజలకు చేరువ చేసేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కూనపరెడ్డి జయరాజు, కందుల సత్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మండలపార్టీ నాయకులు పాల్గొన్నారు.

**పొట్టిశ్రీరాములు చిరస్మరణీయులు**

**తణుకు టౌన్:** తెలుగు భాష మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతూ ఉద్యమించి తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తేతలి–పైడిపర్రు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పైడిపర్రులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు తల్లి, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ సంఘటితంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వంక రాజకుమారి, లయన్స్ మాజీ జిల్లా గవర్నర్ ఎం బాబూజీ, తమ్మయ్య నాయుడు, డాక్టర్ కే ఆనంద్, కె సజనీ, ఎం కృష్ణకుమారి, పుచ్చల బాలాజీ, మారిశెట్టి శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం**

**ఇరగవరం:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, ఎంపీడీవో ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఆవతరించగా, 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడంతో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు శ్రీపొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహర దీక్ష చేసి, ప్రాణాలు అర్పించి అమరజీవి అయిన మహా పురుషుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీటీసీలు, పార్టీ మండల అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రజాపరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మామిడి దానవరప్రసాద్

**తాడేపల్లిగూడెం రూరల్:** వన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేసింది. బుధవారం మండలంలోని మోదుగగుంట గ్రామంలో యూనియన్ అధ్యక్షుడు కుందేటి శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, వారి సంక్షేమానికి ఉపయోగపడేలా మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి, వారి జీవన విధానం మెరుగుపర్చాలన్నారు. కార్ర్యకమంలో యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, పోసీంద్రప్రసాద్, సాగర్, ఎం.శివ, జి.శ్రీను, ఎం.వెంకన్న, డి.స్వామి, అంతర్వేది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి

**జిల్లా జేసీ రామ్‌సుందర్‌రెడ్డి**



నిట్ ఎదురుగా ఆరబెట్టిన ధాన్యం పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

**తాడేపల్లిగూడెం:** రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా స్నేహపూరిత వాతావరణంలో అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రతీ రైతుకు ఆర్‌బీకెల ద్వారా తగినన్ని గోనె సంచులు ఇవ్వాలన్నారు. ఎక్కడా కూడా సంచుల కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వారికి అనువైన, దగ్గరగా ఉన్న రైస్ మిల్లులు రేషనలైజేషన్ ప్రక్రియ జరపాలన్నారు. రైతులకు, రైస్ మిల్లర్లకు ఎలాంటి సంబంధంలేదన్నారు. ఏ రైతు రైస్ మిల్లర్ల దగ్గరకు రావాల్సిన అవసరం లేదన్నారు. సత్యవతి నగర్‌లో బీటీ రహదారి నిర్మాణం పనులను చూశారు. నిట్ కళాశాల నుంచి హైవే వరకు తొమ్మిది కోట్ల రూపాయలతో నిర్మాణం చేయనున్న సీసీ రహదారి, రూట్ మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జేసి వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## వీరమ్మ పార్క్ వద్ద మెప్మా అర్బన్ మార్కెట్



వీరమ్మ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్

**భీమవరం(ప్రకాశం చౌక్):** మెప్మా పరిధిలో ఉన్న స్వయం సహాయక సభ్యులు తయారు చేసే వస్తువులు ప్రదర్శన, అమ్మకానికి మూడో విడత అర్బన్ మార్కెట్ వీరమ్మ పార్క్ వద్ద ఏర్పాటు చేశారు. అర్బన్ మార్కెట్ మొదట జులై నెలలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా పట్టణంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు సీహెచ్ కృపామణి, సెక్రెటరీ అనంత లక్ష్మి, మెప్మా సిటీ మిషన్ మేనేజరు సీహెచ్ నానిబాబు, సీఓలు సంతోషమ్మ, జయకృష్ణ, పెద్దింట్లమ్మ, సమాఖ్య ఆర్పీలు, ఓబీలు, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల అమలులో లయన్స్ ముందంజ

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** సేవా కార్యక్రమాల అమల్లో అంతర్జాతీయ లయన్స్‌క్లబ్ ముందు వరసలో ఉందని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. సేవలకు గాను లయన్స్‌క్లబ్ స్పిరిట్ నుంచి జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు వెయ్యి డాలర్లు (రూ 83 వేలు) విరాళం చెక్కును అందజేశారు. మాణిక్యాలరావు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు విద్యా సంకల్పం, విద్యా సామగ్రి కిట్‌లను అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దూసనపూడి సోమసుందర్, ఓసూరి వీర్రాజు, స్పిరిట్ క్లబ్ అధ్యక్షురాలు నూకల జయ భారతి, జిల్లా సెక్రటరీ నూకల నాగ మల్లేశ్వరరావు, జిల్లా కోశాధికారి వట్టిప్రోలు రాము పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అమ్మవారి ఊరేగింపు



ఆకివీడు గాంధీనగర్‌లో అమ్మవారి ఊరేగింపు

**ఆకివీడు:** సన్మార్గానికి ఆధ్యాత్మికతే మూలమని, దైవానుగ్రహంతో ఏదైనా సాధించవచ్చని వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్ అన్నారు. స్థానిక మాదివాడలోని శ్రీ కృష్ణ దేవరాయ యూత్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గుర్రాల రథంలో అమ్మవారిని పట్టణంలో ఊరేగించారు. ఊరేగింపులో ఎనిమిది రకాల నృత్య బృందాలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపును ప్రారంభించిన రమేష్ మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు బానిస కాకుండా దైవ కార్యక్రమాలు, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గత 15 రోజులుగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో భక్తి భావం పెరగడంతోపాటు పలువురు కళాకారులకు భుక్తి లభించిందని అన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ యూత్ ప్రతినిధులు మోటుపల్లి రామాంజనేయులు, కోడేటి శ్రీనివాస్, అడ్డాల శ్రీనివాసరావు, రామారావు, సత్తినీడి మణికంఠ, మొగిలి కిరణ్, వానపల్లి తేజ, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు పురస్కారాలు



మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న సొసైటీ చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు

**తాడేపల్లిగూడెం అర్బన్:** సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ తాడేపల్లిగూడెం బ్రాంచ్ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో 95 శాతం మార్కులు సాధించిన షేర్ హోల్డర్స్ పిల్లలకు బుధవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు మాట్లాడుతూ సిటిజన్‌సొసైటీ ఆరు రాష్ట్రాల్లో 42 శాఖల ద్వారా రూ.3600 కోట్లకు పైగా వ్యాపారం చేస్తుందన్నారు. గత ఆర్థిక సంవత్సరం 18 శాతం డిమాండ్ చెల్లించినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభకనబర్చిన షేర్ హోల్డర్స్ పిల్లలకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు. 2022–23 విద్యాసంవత్సరానికి యడవల్లి బాలదివ్య భరద్వాజ్, దాసరి త్రిహర్షిక, శ్రీరంగం చాముండేశ్వరిదేవిలకు రూ.10 వేలు చొప్పున నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ మగడలోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘర్షణ కేసులో ఇద్దరి అరెస్టు

**ఆకివీడు :** స్థానిక జాతీయ రహదారిపై కైకలూరు బస్‌స్టాప్ వద్ద ముఠా కార్మికులపై దాడి చేసిన ఘటనలో నక్కా మహేష్, హంసపరుగుల నానిలను బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్సై నాగబాబు తెలిపారు. మద్యం మత్తులో ముఠా కార్మికులపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిని అరెస్టు చేయగా, గాయాలతో ఉన్న మరో వ్యక్తి రాజమండ్రి ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారని పేర్కొన్నారు.

### చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలి

**పెంటపాడు:** కంటి ఆపరేషన్ పేరుతో బెయిల్‌పై బయటకు వచ్చి కోర్టు దిక్కరణకు పాల్పడుతున్న చంద్రబాబు బెయిల్‌ను తక్షణం రద్దు చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు, చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం పెంటపాడులో మాలమహానాడు అత్యవసర సమావేశం అనంతరం మాట్లాడుతూ కేవలం ఆరోగ్య సంబంధిత ఇబ్బందుల నేపథ్యంలో చంద్రబాబుకు బెయిల్ ఇచ్చారని, దఅయితే ఆ పార్టీ నాయకులు నిజమే గెలిచిందని, ర్యాలీలు చేసి, పూలు చల్లుతూ, స్వీట్లు పంచడం వంటి చర్యలు చూస్తుంటే కోర్టు ధిక్కరణకు వస్తుందన్నారు. వైఎస్సార్ సీపీపై టీడీపీ శ్రేణులు, ఎల్లో మీడియా ఎన్ని అసత్యప్రచారాలు చేసినా 2024 ఎన్నికలలో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న జగనన్న సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు స్వరూపరాణి, అమల్‌దాస్, సందీప్, సునీల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఏసీ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**తణుకు:** శ్రీ గోస్తనీ ఏసీ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం తణుకులో నిర్వహించారు. స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పి.రవిశంకర్, ఇ.శివన్నారాయణ, నూతన అధ్యక్షుడు సాధిక్ హుస్సేన్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మాజీ అధ్యక్షుడు ఇ.శివన్నారాయణను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు.

### యూనియన్ సమావేశం

**తణుకు అర్బన్:** ది తణుకు లేత్ అండ్ ఆర్క్ వెల్డింగ్ డిజైన్ వర్క్స్ ఓనర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక పాతవూరు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బలోపేతం చేయాలని, సాధించుకోవాల్సిన విషయాలపై సభ్యులతో చర్చించారు. సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సురేష్, కుడుపూడి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నైతిక విలువలతో ఉండాలి



స్కూలు హెచ్‌ఎంకు లైబ్రరీ బుక్స్‌ను అందిస్తున్న మానవత జిల్లా చైర్మన్ తాడేపల్లి మోహనరావు

**పెంటపాడు:** విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు మంచి విద్యతో పాటు, నైతిక విలువలను క్షుణ్ణంగా నేర్చుకోవాలని పూర్వపు ఆంధ్రాబ్యాంక్ మేనేజర్, మానవత ఉమ్మడి జిల్లా చైర్మన్ తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. మానవత విద్యా విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవత వ్యక్తిత్వ వికాశ శిక్షణలో భాగంగా బుధవారం పరిమెళ్ల జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులకు జిల్లా చైర్మన్ తాడేపల్లి మోహనరావు ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దానిని సాధించే వరకూ అహర్నిశలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ టీవీ రామకృష్ణ, హెచ్ఎం కాంతిశ్రీ, మానవత పెంటపాడు మండల కోశాధికారి ఏలూరి వీరాస్వామి, ఉపాధ్యాయులు రాజంరాజు, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

## జగనన్న లే అవుట్‌కు ఉచిత వాహన సౌకర్యం



జగనన్న లేఅవుట్ వద్ద ఏర్పాటు చేసిన వాహనాన్ని చూపుతున్న ఏసుబాబు, తారకరామనంద

**సాక్షి, భీమవరం:** విస్సాకోడేరు జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను సందర్శించేందుకు లబ్ధిదారుల సౌకర్యార్థం పట్టణం నుంచి లే అవుట్‌కు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటుచేసినట్టు తారకరామ కన్‌స్ట్రక్షన్ చైర్మన్ పళ్ల ఏసుబాబు తెలిపారు. బుధవారం ఇళ్ల నిర్మాణం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాలనీలో ఇళ్ల నిర్మాణం తీరు, నాణ్యతా ప్రమాణాలు పరిశీలించుకొనేందుకు రూ.15 లక్షల వ్యయంతో ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేశామని, ప్రతిరోజూ పట్టణంలోని లబ్ధిదారులను ఉచితంగా లేఅవుట్‌కు తీసుకొచ్చి, తిరిగి వారి ప్రాంతాలకు తరలిస్తామని చెప్పారు. ఈ వాహనాన్ని ఈనెల 6న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించనున్నారని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం కోసం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఒకేచోట దాదాపు నాలుగు వేల గృహాలు నిర్మిస్తున్నారని చెప్పారు. తారకరామ కన్‌స్ట్రక్షన్ వైస్ చైర్మన్ పళ్ల తారకరామనంద పాల్గొన్నారు.

### అర్హులతోనే ఓటరు జాబితా

**ఉండి:** అర్హులతోనే ఓటరు జాబితా సిద్ధం చేస్తామని జిల్లా పంచాయితీ అధికారి, నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మల్లికార్జునరావు అన్నారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో బూత్‌లెవెల్ అధికారు, రెవెన్యూ సిబ్బందితో ముసాయిదా ఓటరు జాబితా సవరణలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటికే విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో తపొప్పుల సవరణపై మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీల నాయకుల సూచనలు, అభ్యంతరాలు పరిగణలోనికి తీసుకోవాలని కోరారు.

### కారు అద్దెకు తీసుకుని ఉడాయించిన వ్యక్తిపై కేసు

**నరసాపురం రూరల్:** మండలంలోని చిట్టవరం గ్రామానికి చెందిన కాటూరి శ్యామ్ తనకు చెందిన షిఫ్ట్ కారును అమలాపురానికి చెందిన బీరా కృష్ణంరాజుకు రోజువారీ అద్దె చెల్లించే ప్రాతిపదికన అద్దెకు ఇచ్చాడు. అయితే కొంత కాలంగా అద్దె చెల్లించక పోవడంతోపాటు తన కారును కూడా తిరిగి ఇవ్వడం లేదంటూ శ్యామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## యుద్ధం.. మానవాళి మనుగడకు ప్రమాదం

**తణుకు టౌన్:** పాలస్తీనాపై ఇజ్రాయేలు చేస్తున్న యుద్ధంలో సాధారణ మహిళలు, చిన్నారులు ఎక్కువగా మృత్యువాతపడుతున్నారని, ఇది మానవాళికి ఆందోళన కలిగించే అంశమని సామాజికవేత్త డీవీవీఎస్ వర్మ చెప్పారు. బుధవారం తణుకులోని సీపీఎం భవన్‌లో తణుకు స్టడీ సర్కిల్, సామాజిక న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో పాలస్తీనా, ఇజ్రాయేల్ యుద్ధంపై నిర్వహించిన రౌండ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజాపై ఇజ్రాయేలు ప్రతిరోజూ బాంబు దాడులు చేస్తూ వేలాది మంది అమాయక ప్రజలను పొట్టనపెట్టుకుంటుందన్నారు. సామ్రాజ్యవాద శక్తులన్నీ పాలస్తీనా అరబ్‌జాతిని అంతం చేసే దిశగా ఎగదోస్తున్నాయన్నారు. ప్రజాస్వామిక వాదులంతా పాలస్తీనా స్వాతంత్ర్య పోరాటాన్ని సమర్థించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పలువురు వక్తలు చర్చించారు. ఈ కార్యక్రమానికి సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరూరి మురళీకుమార్ అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీ దక్షిణామూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు కొరు వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే మునిస్వామి, రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ నీలం మాల్యాద్రి, గొల్లపల్లి అంబేడ్కర్, పొట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వంతెనపై ఇరుక్కున్న కార్ల కంటైనర్



గరగపర్రు వంతెనపై ఇరుక్కున్న కంటైనర్

**పాలకోడేరు:** భీమవరం – తాడేపల్లిగూడెం మార్గంలో గరగపర్రు వంతెన టర్నింగ్‌లో కార్ల కంటైనర్ బుధవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఇరుక్కుపోయింది. దీంతో సుమారు ఆరు గంటల పాటు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తాడేపల్లిగూడెం హైవే నుంచి గరగపర్రు మీదుగా భీమవరంలోని ఓ కార్ల కంపెనీకి వెళ్లాల్సిన కంటైనర్ వంతెన వద్ద ఇరుక్కుపోయినా కార్ల కంపెనీ యాజమాన్యం స్పందించకపోవడంతో స్థానికులు, వాహనచోదకుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో సాయంత్రం యంత్రాల సాయంతో కంటైనర్‌ను వంతెన మలుపు ప్రాంతం తప్పించి ముందుకు తీసుకెళ్లారు. ఆ సమయంలో వంతెన రెయిలింగ్ కొంతవరకు దెబ్బతింది. గతంలో కూడా ఇలాగే ఈ కార్ల కంటైనర్ ఇరుక్కోవడంతో ఈ మార్గంలో వీటిని తీసుకురావద్దంటూ స్థానికులు, అధికారులు హెచ్చరించినా ఫలితంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

**శ్రీ జనార్ధన స్వామి వారి దేవస్థానము**
పడమర విప్పర్రు(గ్రా), పెంటపాడు (మం) ప.గో.జిల్లా

**E-Procurement Tender**
NIT NO.P1/COE/523/2023-38 Dt.01.11.2023

అర్చక క్వార్టర్స్ నిర్మాణము కొరకు e -procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ ను చూడగలరు.

తేది:01-11-2023 పడమర విప్పర్రు
సం/- కె.సాంబశివరావు
సెల్ :98669 37145

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395, 63097 62918
తణుకు: 90108 43311, 90100 51493
Office mail : tpgadvt@gmail.com